www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 జూన్ 2024
5
చిత్తూరు

అవినీతి డీఎఫ్‌వోపై చర్యలు తీసుకోవాలి

ఏపీ రైతు సంఘం నేతల డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న పద్మనాభనాయుడు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి మరికొందరు అధికారులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండదండలతో అవినీతికి పాల్పడ్డారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పద్మనాభనాయుడు ఆరోపించారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డికి వంతపాడుతూ కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ బాలకృష్ణారెడ్డి, రెవెన్యూ అధికారులు శ్యాంప్రసాద్‌రెడ్డి, మధురెడ్డిలపై ప్రభుత్వం వెనువెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వారి బాగోతాలను క్షేత్ర స్థాయిలో విచారణ చేపడితే అనేక అక్రమాలు వెలుగు చూస్తాయని పేర్కొన్నారు.

ప్రధాన ఆరోపణలివే..

- సోమల, చౌడేపల్లి మండలాల్లో అటవీ ప్రాంతాల్లోనే భూములను అమ్ముకోవడంతో పాటు ఫలసాయాన్ని అక్రమ మార్గంలో సొమ్ము చేసుకున్నట్లు తెలిపారు. ప్రధానంగా అటవీ సరిహద్దు ప్రాంత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడంతో పాటు 10వన్ అడంగల్‌ను కూడా రద్దు చేసి ఇబ్బందులు పెట్టినట్లు తెలిపారు.
- సోమల మండలం ముచ్చుకాలువ, అవులపల్లి, పులిచెర్ల మండలం మంగళంపేటలో సుమారు 200 ఏకరాల అటవీ భూములను పెద్దిరెడ్డి బీనామీల పేర్ల పట్టలు ఇచ్చిన్నట్లు ఆరోపించారు. వీరి ఆగడాలను ప్రశ్నించిన రైతులపై అక్రమకేసులు పెట్టి బెదిరిస్తున్నట్లు చెప్పారు.

కూరగాయలు... లాభాల సా(బా)గు

అన్నదాతలకు మోదం... వినియోగదారులకు ఖేదం

ధర ఇలాగే ఉంటే టమోటా రైతుకు లక్షల్లో లాభం

కుప్పంలో కూరగాయలు పండిన చోటల్లా 'పసిడి'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కుప్పం కూరగాయల సాగుకు పెట్టింది పేరు.. కూరగాయలే కాదు ఆకుకూరలు, పూలు, పండ్లు విస్తారంగా పండిస్తారు.. అక్కడి వాతావరణం బెంగుళూరుకు దగ్గరలో ఉండడంతో చల్లగా ఉంటుంది. కూరగాయల సాగుకు అనువుగా ఉంటుంది. దీంతో అన్నదాతలు ఈ ప్రాంతంలో ఎక్కువగా కూరగాయలను సాగు చేయడానికే ఎక్కువ మక్కువ చూపుతారు. అయితే ఎన్నడూ లేని విధంగా కూరగాయల ధరలు ఈసారి మండుతున్నాయి. ఇది వినియోగదారులకు ఇబ్బందిగా అనిపిస్తుంటే, కూరగాయలు సాగు చేసే అన్నదాతలకు ఆనందం కనిపిస్తోంది.. కూరగాయలు కొనలేక వినియోగదారులు మాంసాహారం వైపు మొగ్గుచూపుతున్నారు. కూరగాయల ధరలు గుడ్లు, చికెన్, ఎండుచేపలు, మటన్‌తో పోటీ పడుతుండడంతో వాటినే ఎక్కువగా తింటున్నారు. కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, గుడిపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాల్లోని నల్లరేగడి నేలల్లో సాగు చేసిన కూరగాయలన్నీ 'నల్ల బంగారాన్ని' తలపిస్తున్నాయి.

కుప్పం నియోజకవర్గంలో 3వేల ఎకరాల్లో కూరగాయలను సాగు చేస్తుంటారు. రోజుకు టన్నుల కొద్దీ బెంగుళూరు, చెన్నయ్, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి మార్కెట్లకు వస్తుంటాయి. ఉత్తర భారతదేశంలో పండే ఉర్లగడ్డ, తెల్లగడ్డ, బీన్స్, ఎర్రగడ్డ సైతం ఈ ప్రాంతంలో పండుతాయి. క్యాబేజీ, క్యాలిఫ్లవర్‌కు పెట్టింది పేరు. అనుకున్న సమయానికి వర్షాలు పడకపోవడం, నీళ్లు కట్టి చేతికొచ్చిన పంటను తీసుకునే లోపే అకాల వర్షాల వల్ల ఇంత రేట్లు పెరిగాయని రైతు రామప్ప 'ప్రజాశక్తి'కి తెలిపారు. గతంలో కుప్పం మార్కెట్‌కు ఒక బ్యాగ్ తెస్తే వంద రూపాయల నోట్‌కు బ్యాగ్ నిండేదని, ప్రస్తుతం ఒక కూరగాయ మాత్రమే కొనాల్సి రావడం ఆశ్చర్యంగా ఉందని వినియోగదారుడు విద్యాసాగర్ (టీచర్) అన్నారు. కొత్తిమీర కట్ట కుప్పంలో 5-10 రూపాయల విలువ చేస్తుంది. అలాంటి కొత్తిమీర ఘుమఘుమలతో పాటు రేటు చూస్తే కట్ట రూ.60 పలుకుతోంది. ఒక్క సొరకాయ మాత్రమే కిలో రూ.20 ఉంది. కూరగాయలను పరిశీలిస్తే కుప్పంలో పండిన పంట అక్కడి ప్రజలకు సైతం కొనాలంటే భారంగా ఉండటం గమనార్హం.

కొనేందుకు ముందుకు రావడం లేదు

స్వరూప, కూరగాయల వ్యాపారి, కుప్పం

నేను పదేళ్లుగా కుప్పం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కూరగాయల అంగడి పెట్టుకుని జీవిస్తున్నాను. ఇక్కడే పంట పండుతుంది. దీంతో నేరుగా రైతు దగ్గరకు వెళ్లి పంట కొంటున్నాను. కిలోపైన ఐదో, పదో అదనంగా లాభం పెట్టుకుని అమ్ముతున్నాం. అయితే కూరగాయల ధరలకు వినియోగదారులు భయపడి కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ధర ఎక్కువగా ఉండడంతో ధర తగ్గించి ఇవ్వలేకపోతున్నాం. అయితే మూడు రోజులైతే కూరగాయలు కుళ్లిపోతాయి. కష్టమర్లకు కూరగాయలు ఇవ్వలేకపోతున్నాం. తక్కువకు అమ్మలేకపోతున్నాం. కుళ్లిపోయాక ఆవులకు వేస్తున్నాం తప్ప వినియోగదారులకు ఇవ్వలేకపోతున్నాం. ఏదిఏమైనా ప్రస్తుతం ధర బాగుందని చెబుతున్నా కష్టకాలమే.

ఇదే ధర ఉంటే రూ.3-4 లక్షలు లాభం

గత ఏడాది మా తమ్ముడు ఎకరా 10 సెంట్లలో టమోటా సాగు చేశాడు. లక్షా 70వేల రూపాయలు పెట్టుబడి పెట్టాడు. నారు, ఎరువులు, కూలి, కట్టెలు, దారాలన్నింటికీ ఖర్చు చేశాడు. చాలా తక్కువ రేటు పలికింది. బాక్స్ (16 కిలోలు) రూ.30 ధర పలికింది. కూలి కూడా రాలేదని రోటోవేటర్‌తో దున్నేశాడు. అప్పట్లో నష్టం రావడంతో ప్రస్తుతం ఈ ఏడాది కనకాంబరం సాగు చేస్తున్నాడు. అయితే ప్రస్తుతం కూరగాయల ధరలు బాగుండడంతో నాటలేదన్న బాధ నా తమ్ముడిలో ఉంది. అయితే నేను ఈ ఏడాది 54 సెంట్లలో టమోటా సాగు చేశాను. ప్రస్తుతం బాక్స్ (16 కిలోలు) రూ.700-800 ధర పలుకుతోంది. 70వేలు పెట్టుబడి పెట్టారు. ఇదే ధర ఉంటే 3-4 లక్షలు లాభం వచ్చే అవకాశం ఉంది.

మురగేష్, రైతు, గుడిపల్లి

కూరగాయలు (కిలో)	ధర (రూ)
వంకాయలు	రూ.60
టమోటా	రూ.80
బీన్స్	రూ.80
పందిరి చిక్కుడు	రూ.80
పచ్చిమిర్చి	రూ.90
బెండకాయ	రూ.40
క్యాబేజీ	రూ.30
బీరకాయ	రూ.50
క్యారెట్	రూ.70
మునక్కాయ	రూ.180
కాకరకాయ	రూ.80
ముల్లంగి	రూ.40
తెల్లగడ్డ	రూ.200
ఎర్రగడ్డ	రూ.40
బీట్‌రూట్	రూ.60
సొరకాయ	రూ.20
కొత్తిమీర కట్ట	రూ.60

నష్టమొచ్చిందని సాగు చేయలేదు : అప్పయ్యగౌడ్, గుడిపల్లి

గత ఏడాది నవంబర్ నెలలో ఎకరా పొలంలో టమోటా సాగు చేశారు. ఫిబ్రవరి నాటికి పంట చేతికొచ్చింది. వర్షాలకు ఎక్కువ వైరస్ సోకింది. ధర పలకలేదు. లక్ష పెట్టుబడి పెట్టాను. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. మార్చి నెలలోనే మరోసారి పంట వేసి ఉంటే ప్రస్తుతం పంట చేతికొచ్చేది. నష్టాలొచ్చేసరికి డీలా పడిపోయాను. ప్రస్తుతం ఎకరా పొలంలో క్యాబేజి సాగు చేశాను.

డయేరియాను అరికట్టడమే లక్ష్యం

- **జిల్లా వైద్యశాఖ అధికారి ప్రభావతి**

అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌వో ప్రభావతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేల్కూరు, కడపగుంట విలేజ్ హెల్త్ క్లినిక్‌ను డీఎంహెచ్ంఓ ప్రభావతి ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియా అరికట్టడమే లక్ష్యం అన్నారు. ఎంఎల్‌హెచ్‌పికి సంబంధించిన రికార్డుల ను వెరిపై చేసి పలు సూచనలు చేశారు. ప్రతివారం ఓవర్ హెడ్ ట్యాంక్ వాటర్ క్లోరినేషన్‌పై పరిశీలిం చారు. వాతావరణ పరిస్థితుల వల్ల, నీటి పైపుల లీకే జ్ వల్ల, నీరు కలుషితం అవడం వలన వచ్చే డయేరి యా, అతిసారా, డీసెంట్రీ, కామెర్లు, టైఫాయిడ్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాదేవి, సిహెచ్‌వో శ్రీనివాసులు, వైద్య సిబ్బంది మాధవి, నవీన, సంధ్య, అమరావతి, ధర్మేంద్ర, కదిరివన్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల అక్రమాలపై లోకాయుక్తలో ఫిర్యాదు

ప్రజాశక్తి-శాంతిపురం: మండలంలోని మఠం ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులలో చాలా అవినీతి అక్రమాలకు జరి గాయని లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. నాడు-నేడు పనులలో ధనార్జన ధ్యేయం గా పాఠశాల అభివృద్ధిని గాలికి వదిలేసి లక్షల్లో తప్పుడు రికార్డు దొంగ బిల్లులు పెట్టుకుని స్వాహా చేశారని ఫిర్యాదు చేశా రు. వివరాల్లోకెళితే చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం మఠం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నటరాజ్ రెడ్డి ఒక మాజీ ప్రజా ప్రతినిధి అండదండ ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాడు-నేడు పనుల్లో తప్పుడు బిల్లులు రికార్డులు సృష్టించి స్వాహా చేశారని, శాంతిపురం మండలం సంబంధిత అధికారులకు ఈ విషయంపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించుకోలేదు పాఠశాల కమిటీ సభ్యులు దేవరాజ్ అన్నారు. అందుకుగాను రాష్ట్ర గవర్నర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ, రాష్ట్ర లోకాయుక్త కమిషన్ ఫిర్యాదు చేయడంతో స్పందించిన యంత్రాంగం ఆధారాలు తీసుకుని కేసు నెంబర్ -1163/2024 ఆగస్టు 14 వ తారీకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నాడు-నేడు పనులు పూర్తిగా ఒక ప్రత్యేక విచారణ కమిటీ నియమించి ప్రధానోపాధ్యాయుడు నటరాజ్ రెడ్డిని సస్పెండ్ చేయాలని పాఠశాల కమిటీ మెంబర్ దేవరాజ్ మాదిగ కోరారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి
- కలెక్టర్ సుమిత్‌కుమార్

వైద్యులతో అక్కడి పరిస్థితులను చర్చిస్తున్న కలెక్టర్

నగరి ప్రాంతీయ ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: నగరి ప్రాంతీయ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. శు క్రవారం నగరి ప్రాంతీయ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. గైనిక్, క్యాజువాలిటీ, ఐసీయూ, మెడికల్ వార్డు, లేబర్ వార్డు, జనరల్ సర్జరీ వార్డు, పోస్ట్ ఆపరేటివ్ వార్డు(సిజేరియన్-ఫ్యామిలీ ప్లానింగ్ వార్డు)లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రులలోనే సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. ఇందుకు గాను క్షేత్ర స్థాయిలో గల ఏఎన్‌ఎంలు గర్భిణీల ఆరోగ్య స్థితిగతులపై పూర్తి అవగాహన ఏర్పరచుకొని వారికి అవసరమైన పూర్తి వైద్య సేవలు సకాలంలో అందించాలన్నారు. మాత శిశు సంరక్షణలో భాగంగా శిశు మరణాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్యశ్రీ నిధుల కింద పేదవారికి చేయవలసిన రక్త పరీక్షలు చేసేందుకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. చంటి పిల్లలకి అవసరమైన మందులను ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలన్నారు. బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను త్వరితగతిన బ్లడ్ బ్యాంకుగా మార్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రాంతీయ ఆసుపత్రిలో రోజుకు ఓపిలో భాగంగా 500 - 600మంది రావడం జరుగుతుందని, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ పీడియాట్రిక్ కేసుల ఎక్కువగా రావడం జరుగుతుందని, ప్రాంతీయ ఆసుపత్రిలో గైనకాలజిస్టు -3 జనరల్ సర్జన్-1, జనరల్ మెడిసిన్ -2, పీడియాట్రిక్-1, డెర్మటాలజీ-1, ఈఎన్‌టి -1, అస్తీషియా-2, ఆప్తమాలజీ -1 వీటితో పాటు డెంటల్ డాక్టర్-1, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు-3, పేథాలజిస్ట్-1, బ్లడ్ స్టోరేజ్ సెంటర్ అందుబాటులో కలదని డీసీహెచ్‌ఎస్ డా.రాజశేఖర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులు తమకు రావలసిన జీతాలు బకాయి ఉందని చెల్లించాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పారిశుద్ధ్య కార్మికుల వివరాలు, వారికి జీతాలు చెల్లించాల్సిన గుత్తేదారు వివరాలను ఆరాతీసి వెంటనే ఈ అంశాన్ని పరిష్కరించాలని డీసీహెచ్‌ఎస్‌కు సూచించారు. ఈ పర్యటనలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, ఆర్ఎంఓ డాక్టర్ కార్తికేయన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడికి 24ఏళ్ల జైలు శిక్ష

- 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ తీర్పు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: 2014లో మైనర్ బాలికపై జరిగిన అత్యాచార సంఘటనలో 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ శాంతి సంచలన తీర్పును ఇచ్చారు. మైనర్ బాలిక అత్యాచారం కేసులో నిందితుడైన దేవరాజ్‌కు 24 ఏళ్ల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. చిత్తూరు జిల్లా, గుడిపల్లె మండలం సాలచింతనపల్లె గ్రామంలో 9వ తరగతి చదువుతున్న 14 ఏళ్ల మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన సి.దేవరాజ (26) 05జూలై 2014న ఉదయం బాలిక స్కూల్‌కు వెళ్ళే సమయంలో స్కూల్ దగ్గర దింపుతానని మాయమాటలు చెప్పి ద్విచక్ర వాహనంలో ఎక్కించుకొని ఒక నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకోని వెళ్లి బాలికపై అత్యాచారం చేసి అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం ఇంటికి వెళ్ళిన బాలిక వారి తల్లి తండ్రులకు తెలిపి గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరాజ్‌పై 417, 376(2)(1), 506, 2012 కింద నాటి గుడిపల్లి ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి కుప్పం రూరల్ ఇన్స్పెక్టర్ కె.వేణుగోపాల్ విచారణ అధికారిగా వ్యవహరించారు. 2014 జూలై 10వ తేది ముద్దాయిని గుడిపల్లి పరిసర ప్రాంతంలో అరెస్ట్ చేసి దర్యాప్తు నిమిత్తం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విచారణ శుక్రవారం పూర్తి అయింది. మైనర్ బాలిక అత్యాచారం కేసులో సి.దేవరాజ్‌కు 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ జడ్జ్ శాంతి ముద్దాయికి 24 ఏళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పును ఇచ్చారు. మైనర్ బాలిక అత్యాచారం కేసులో ముద్దాయికి శిక్ష పడుటకు కృషి చేసిన అప్పటి కుప్పం రూరల్ ఇన్స్పెక్టర్ కె.వేణుగోపాల్, కోర్ట్ మానిటరింగ్ సెల్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ కె.బాలయ్య, కోర్టుకు సాక్షాలను సకాలంలో హాజరు పరచిన కోర్ట్ కానిస్టేబుల్‌లను, కోర్ట్ మానిటరింగ్ సెల్ సిబ్బందిని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ప్రత్యేకంగా అభినందించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పూతలపట్టు: అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మురళీ మోహన్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజల కలలను సాకారం చేయడానికి ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు



ప్రజాశక్తి-కార్వేటినగరం: జీడి నెల్లూరు ఎమ్మె ల్యే డాక్టర్ థామస్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం కార్వేటినగరం టిడిపి కార్యాల యంలో తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో భారీ కేకను థామస్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి పలువురుకి పంచిపెట్టారు. అదేవిధంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా నియోజక వర్గంలోని ఎస్ఆర్ పురం, వెదురుకుప్పం, గంగాధరనెల్లూరు మండలాల్లో ఆయన అభిమానులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు చెంగ్రాయల్ యాదవ్, రాజేంద్ర రెడ్డి, నాగేశ్వరరాజు, తిరుమలనాద్, రవి యాదవ్, వెళయుధం, రాధాకృష్ణ యాదవ్, వాసుదేవ రెడ్డి, మోహన్, బిగలరమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల్లో వచ్చే వ్యాధులపై అవగాహన ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిన్నపిల్లల్లో వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి అన్నారు. శుక్రవారం 0-18 ఏళ్ల పిల్లల్లో వచ్చే నాలుగు రకాల లోపాలపై ఒకరోజు శిక్షణను లాంచనంగా ప్రారంభించారు. ఈ శిక్షణలో ముఖ్యంగా పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలు గుర్తించుట, పిల్లలకు తల నుంచి పాదం వరకు చేసే పరీక్ష విధానము, అంగన్వాడి పిల్లలకు పాఠశాల పిల్లలకు, హైస్కూల్, కాలేజీ విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి పుట్టుకతో వచ్చే లోపాలను, పోషకాహార పెరుగుదల లోపలను, జన్యుపరమైన లోపాలు వైకల్యాలు, వివిధ రకాల అంటూ వ్యాధులను గుర్తించి చికిత్స అందించుట ముఖ్య లక్ష్యం. చికిత్స చేయలేని వారికి డిఇ ఐసి (డిస్టిక్ అర్లీ ఇంటర్ వెన్షన్ సెంటర్ కు) రిఫర్ చేయుట విధానాలను ఈ శిక్షణ ద్వారా ఇవ్వడం జరిగింది. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం శుక్రవారం, శనివారం, జులై మూడో తేదీ జిల్లాలోని అందరూ డాక్టర్లకు, స్టాఫ్ నర్సులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిపిఎంఓ డాక్టర్ హర్షవర్ధన్, పీడియాట్రిషన్ డాక్టర్ దుర్గ ప్రసాద్ నాయుడు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డిఈఐసి మేనేజర్ స్వామి దాస్, స్టాఫ్ పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడిపిన 11మందికి జరిమానా

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: తాగి వాహనాలు నడిపిన 11మందికి కోర్టు జరిమానా విధించింది. గురువారం చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు ఆధ్వర్యంలో వాహన తనిఖీ చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11మంది పట్టుబడ్డారు. వారిని పోలీసులు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో శుక్రవారం ఉదయం ప్రవేశపెట్టగా జడ్జ్ ఉమాదేవి వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున జరిమానా విధించారు. ఈ 7 నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన 234 మందికి సుమారు రూ.17లక్షల ఫైన్ విధించడం జరిగింది. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు హెచ్చరించారు.

ఎమ్మెల్యే చొరవ.. గంటల్లోనే బోరు మోటర్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలోని కట్టమంచి నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రక్కన తాగునీటి బోరు మరమ్మతుకు గురైంది. నీళ్ల లేక విద్యార్థులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులను ఆదేశించి యుద్ధప్రాతిపదికన 24గంటల్లో మోటారు బోరును మరమ్మత్తు పనులు చేయించారు. స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

ద్రావిడ వర్సిటీ వీసీ రాజీనామా

ప్రజాశక్తి-గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ భోధన, భోధనేతర సిబ్బందితో కందుకూరి వీరేశలింగం పంతులు ఆడిటో రియంలో సమావేశాన్ని నిర్వహిం చారు. వర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేశానని.. ద్రావిడ వర్సిటీ లాంటి సంస్థకు కొన్ని నెలలైన విసిగా పని చేయడం అదృష్టంగా, సంతోష ంగా ఉందన్నారు. వర్సిటీలో తనకు సహక రించిన అందరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో వర్సిటీ మరింత అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. అనంతరం వర్సిటీ సిబ్బంది ఆమెను శాలువాలతో సత్కారించి వీడ్కోలు పలికారు.

ఆర్‌టీసీని బలోపేతం చేయాలి

- కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలి
- డిపో సమావేశంలో సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-పుంగనూరు: ప్రభుత్వ రంగ సంస్థ ఆర్టీసీని బలోపేతం చేసి సిబ్బందికి పని ఒత్తిడి తగ్గించాలని ఆర్టీసీ జోనల్ కార్యదర్శి భాస్కర్, సిఐటియు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో పుంగనూరు డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ శాఖా సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేసిన తప్పిదం వలన ఆర్టీసీ నష్టాల్లోకి వెళ్లిందన్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థను కాపాడే విధంగా నిధులు కేటాయించి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి రకరకాల ఒత్తిడితో అనారోగ్యాలతో గురవుతున్నారని పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. మహిళా కండక్టర్లకు రాత్రి సమయాల్లో డ్యూటీలు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అర్ధరాత్రిలో డ్యూటీలు దిగిన వారికి ఆయా డిపోల్లో మౌలిక వసతులతో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడంలో ఆర్టీసీ ముందంజలో ఉందని దానికి తగ్గట్టు ఏర్పాట్లు కూడా చేయాలన్నారు. కాలుష్యం నియంత్రణ పేరుతో ఎలక్ట్రికల్ బస్సులు తీసుకురావడం మంచిదే అయినప్పటికీ వాటిని ఆర్టిసినే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పరం ఆలోచనలు మానుకోవాలన్నారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఎస్డబ్ల్యూఎఫ్ సిఐటియు ఆధ్వర్యంలో సంస్థ రక్షణ కోసం కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేయడం జరిగిందని వాటిని భవిష్యత్తులో ఉధృతం చేస్తామని తెలిపారు. పుంగనూరు డిపోలో కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.



ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ ఎన్నిక

పుంగనూరు డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా వాడ గంగరాజు అధ్యక్షురాలుగా మమత, కార్యదర్శిగా నాగార్జున, ఉపాధ్యక్షులు హరినాథ్, సహాయ కార్యదర్శి కె.వి రెడ్డమ్మ, కోశాధికారిగా శోభ, ప్రచార కార్యదర్శులుగా ప్రమీల, శిరీషలతో పాటు ఐదు మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.

1న ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: జూలై 1న ఉదయం 6గంటలకు రూ.7వేల ఎన్‌టిఆర్ పింఛన్ పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.4వేల పింఛన్‌తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలల పింఛన్ బకాయి కలిపి రూ.7వేలు చెల్లించడం జరుగుతుందన్నారు. వికలాంగులకు, మల్టీ డిఫార్మిటీ కలిగిన వారికి రూ. 6వేలు, పక్షవాతం, ప్రమాదాల కారణంగా కుర్చీకి పరిమితమైన వారికి రూ.15వేలు, కిడ్నీ బాధితులు, కాలేయం, గుండె మార్పిడి డయాలసిస్ పేషంట్లకు రూ.10వేలు, అభయహస్తం వారికి ఇదివరలో ఇచ్చే రూ.500 ఇవ్వడం జరుగుతుందన్నారు. సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇంటివద్దకే వచ్చి పింఛన్ అందిస్తారన్నారు.

శాంతిపురం: సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఒక్కరికి ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో మొత్తం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 8247మందికి గాను రూ.5కోట్ల 58లక్షల 86వేల సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఈనెల 30వ తేదీ ఆదివారం స్థానిక రాములవారిగుడి వీధిలోని జైన్ ప్రార్థనా మందిరంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జైన్ సంఘం ప్రతినిధి సుభాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఆధార్ కార్డులను తీసుకొని ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకల్లా రావాలని పేర్కొన్నారు. తిరుపతి అరవింద్ ఐ హాస్పిటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైతే వారికి ఉచితంగా భోజనం వసతి ఏర్పాటు చేసి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు.

విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ బిరుగుండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో టిడిపి గాండ్ల తెలికుల సాధికార సమితి సభ్యుడు వేలాద జగన్నాధం, మండల అధ్యక్షుల ఆనంద రెడ్డి, రాష్ట్ర నేత మనస్వామి విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను పాఠశాలకు బహూకరించారు. అదేవిధంగా అత్తిపట్టులో ప్రాథమిక పాఠశాలలో పార్టీ పుస్తకాలు, షూలు, బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో సీతాపతి, చలపతి, చిన్ని కృష్ణ, రామ్మూర్తి, జయశంకర్, బాలరాజు, రవీ, సుబ్రమణ్యం, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టిటిడి ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన సాయిలక్ష్మీదేవి జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు. వారిని ఆలయ అధికారి అభినందించారు.

విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీలో ప్రాథమికోన్నత పాఠశాల, సచివాలయం, గ్రామంలోని వీధులు, పలువురు రైతుల పంటపొలాల్లో వేమ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శ్రమదానం చేశారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, వర్షపునీటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా వేమ కళాశాల అధ్యాపకుల ఆదేశాల మేరకు శ్రమదానం నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు గ్రామస్తులు, యువకులు సహకారం అందించారు.

నియామకం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల సింగిల్ విండో సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జ్ అధికారిగా చిత్తూరు సబ్ డివిజన్ కోఆపరేటివ్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు రెడ్డిని జిల్లా అధికారులు నియమించారు. శుక్రవారం గంగాధర నెల్లూరు సింగిల్ విండో సొసైటీలో పర్సన్ ఇన్‌ఛార్జ్ అధికారిగా శ్రీనివాసుల రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

సత్కారం

జె.వి శంకర్ దంపతులను సత్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి-గుడిపల్లె: మండల ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా, ఈవోపీఆర్డీగా పనిచేసిన జె.వి శంకర్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాజకీయ నేతలు, ప్రభుత్వ అధికారులు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. శంకర్ సేవలను కొనియాడారు.

'సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి-రామకుప్పం: ప్రభుత్వ అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆనంద రెడ్డి, మాజీ జెడ్పిటిసి మునస్వామి కోరారు. శుక్రవారం మండల సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా అధికారులు.. టిడిపి శ్రేణులను సమన్వయం చేసుకొని అభివృద్ధికి తోడ్పడాలన్నారు. తహశీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో ఈశ్వరయ్య, సీతాపతి, చిన్ని కృష్ణ, చలపతి, గంట్యప్ప గౌడ్, రామ్మూర్తి, విశ్వనాథ్, రవీ, మనోహర్, సుబ్రి పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

ప్రజాశక్తి-కార్వేటినగరం: సీఎం చంద్రబాబు, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఎన్నికల్లో విజయం సాధించడంతో తిరుమలకు పాదయాత్రగా వెళ్లి మొక్కు తీర్చుకోనున్నట్లు మాజీ సర్పంచ్ పట్టెం సోమశేఖర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం శ్రీవారిమెట్టు నుంచి తిరుమలకు కాలినడకన బయలుదేరి వెళ్లారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని ముద్దిగుప్పం గ్రామపంచాయతీ చొక్కామడుగు గ్రామంలో తాగు నీరు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ స్థానిక నాయకులు మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే అయినా తర్వాత మొట్టమొదటిసారిగా చొక్కామడుగు గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వెనువెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానిక నాయకులను ఆదేశించి సమస్యను పరిష్కరించారు. స్థానిక ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడంతో సమస్య తాగునీటి సమస్య తీరిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటేష్ రెడ్డి, హేమాద్రి, గణేష్, మురళి, తహశీల్దార్ ఆల్ఫ్రెడ్ ధోని, ఎంపీడీవో మురళీమోహన్, ఏవో కృష్ణయ్య, డాక్టర్ సందీప్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయులు గుర్రప్ప

ప్రజాశక్తి - కార్వేటినగరం: ఉపాధ్యాయులకు ఆదర్శ ప్రాయుడు గుర్రప్ప అని ఎంఈవో విజయకుమార్ అన్నారు. శుక్రవారం కేఎం పురం ఉన్నత పాఠశాలలో గుర్రప్ప ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆ పాఠశాల హెచ్‌ఎం సునీత ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ మంచి నడవడిక, విలువలతో కూడిన క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయులకు గుర్రప్పను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని గుర్తు చేశారు. అనంతరం పలు మండలాలకు చెందిన ఎంఈవోలు బాబయ్య, మనోజ్‌కుమార్, తిరుమల రాజు, రవిశంకర్, శ్రీదేవీలు తదితరులు గుప్ప్ర సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కేశవులు, హేమాద్రి నాయుడు, మధుసూధన్రెడ్డి, గోవిందయ్య, ఎస్ఎస్ నాయుడు, సర్పంచ్ వెంకటేష్, మాజీ సర్పంచ్ విజయులురెడ్డి, ఉపాధ్యాయులు దైవశిఖామణి, చంద్ర, దాము పలువురు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

- మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించండి
- నింద్ర మండల సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యేల ఆదేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నింద్ర మండలం లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముంద స్తు చర్యలు చేపట్టాలని చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం నింద్ర మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో నిర్వహించిన నింద్ర మండల సర్వసభ్య సమావేశానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, నగరి శాసన సభ్యులు గాలి భానుప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. దీంతో పాటు సిసి రోడ్లకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ మండల సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అభివృద్ధి పనులకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశం లో ఎంపిపి దీప, ఎంపిడీఓ భవాని, తహశీల్దారు నాగమణి, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాను ప్రకాష్

'వంద రోజుల లక్ష్యం'ను సిద్ధం చేయాలి

సచివాలయ ఇంజనీర్లకు గృహ నిర్మాణ శాఖ ఈఈ ఆదేశం

ప్రజాశక్తి - సత్యవేడు: పక్కా గృహ నిర్మాణ ప్రగతి, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై వంద రోజుల లక్ష్యంను సిద్ధం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ మోహన్ రావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణానికి సంబంధించి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికపై ఆయన సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మోహన్ రావు మాట్లాడుతూ రానున్న వంద రోజుల్లో చేపట్టి పూర్తి చేయాల్సిన పనులపై తగిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా గతంలో నిర్మించిన పాత ఇళ్లకు సంబంధించి బిల్లులు పెండింగ్, ఆన్‌లైనులో అప్‌లోడ్ కానివి తదితర వివరాలను సచివాలయాల వారిగా గృహ నిర్మాణ శాఖ నుంచి తీసుకోవాలని ఆయన సచివాలయ ఇంజనీర్లకు సూచించారు. ఇప్పటికే లే అవుట్‌లలో కొనసాగుతున్న గృహ నిర్మాణా లకు సంబంధించి పనుల పురోగతిని సమీక్షించు కోవా లన్నారుం. ప్రధానంగా లే అవుట్‌లలో అంతర్గత సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. మండలంలో 19 లే అవుట్లలో 1504 పక్కా గృహాలు గతంలో మంజూరు అయిందన్నారు. ఇందులో 647 పక్క గృహాలు పూర్తయ్యాయని ఆయన వివరించారు. 42 పక్కా గృహాలు స్లాబ్ దశలో ఉన్నాయని, ఇంకా 283 పక్కా గృహాలు ప్రారంభం కాలేదన్నారు. వీటి అన్నింటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ డిఈ సత్య నారాయణ, ఇన్‌ఛార్జి ఏఈ సుబ్రహ్మణ్యం, పలువురు సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హౌసింగ్ అధికారులు

అభివృద్ధి పథంలో నడిపిద్దాం...

చంద్రగిరి అధికారులు, నాయకులకు ఎమ్మెల్యే పిలుపు

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి): గత పది సంవత్సరాలుగా అభివృద్ధి ఆనవాళ్లు ఎరుగని చంద్రగిరిని అభివృద్ధి పథంలో నడిపించడానికి అధికారులు, నాయకులు అందరూ చేయి చేయి కలపాల్సిన అవసరం ఉందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపు నిచ్చారు. నియోజకవర్గంలో ఏ పని ప్రారంభించాలన్న చంద్రగిరి నుంచి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే గతంలో చెప్పిన మాట ప్రకారం శుక్రవారం అక్కడ పార్టీ నాయకులతో చర్చించి చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. చంద్రగిరి పట్టణం కొత్తపేట ఎంజి బ్రదర్స్ లేఅవుట్ లో ప్రభుత్వానికి ఇచ్చిన రెండు ఎకరాల స్థలాన్ని సర్వే చేసి గుర్తించాలని అందులో చక్కటి గార్డెన్ తో ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే నాని అధికారులతో చర్చించారు. మూలస్థాన ఎల్లమ్మ కొండ చుట్టూ తిరునాళ్లలో తోట ఉత్సవం నిర్వహించే పురాతన వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ ఆవరణలో ఉన్న కోనేటిని ఎమ్మెల్యే పరిశీలించారు. కోనేటి మరమ్మతులు చేసి ఆధునీకరించాలన్నారు.

ఎమ్మెల్యే పేరుతో వసూలు చేస్తే చర్యలు..

రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే రిజిస్ట్రార్ అధికారి, సిబ్బంది, దస్తావేజుల లేఖర్లతో మాట్లా డుతూ గతంలో రిజిస్ట్రార్ కార్యా లయానికి వచ్చే రైతుల నుంచి ఎమ్మెల్యే పేరు చెప్పి మామూళ్లు వసూలు చేసే వారని తన దృష్టికి వచ్చిం దన్నారు. ఇప్పుడు కూడా చెవిరెడ్డి ఎమ్మెల్యే అనే భ్రమలో మీరు ఉన్నట్లు అనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హోమియో వైద్యశాల సందర్శన

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): మంగళం పరిధిలోని ప్రభుత్వ హోమియో వైద్యశాలను ఆయు ష్ విభాగ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ (జోన్-4) డాక్టర్ ఎం శేఖర్‌రాజు శుక్రవారం ఆకస్మికం గా సందర్శించి వైద్యశాల రిజిష్టర్‌లను పరిశీలిం చారు. ఈ సందర్భంగా హోమియో వైద్యాధి కారిణి ప్రసన్న లక్ష్మిని ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారిణి ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా కమిషనర్ రాజేంద్రప్రసాద్ రూ.3.5 లక్షలను వైద్యశాల ఆధునీకరణ కోసం మంజూరు చేయించారన్నారు. స్థానికంగా హోమియో వైద్యసేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఉన్నత లక్ష్యంతో ఆధునీకరణకు నిధులు మంజూరు చేయించారని ఆ ఫలితం ప్రజలకు చేరాలని ఆర్‌డిడి శేఖర్‌రాజు ఆమెకు సూచించారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యశాల సిబ్బంది తారకనాథ్, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం బంగారుపాళ్యం మండలంలోని కేజీ సత్రం గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్లప్ప సమాచారం మేరకు గ్రామానికి చెందిన హేమాద్రి (35) మద్యానికి బానిసై మత్తులో ఇంట్లోనే వంట రూమ్‌లోని హూక్కుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా

- ఒకరి మృతి

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: ముందు వెళుతున్న వాహనాన్ని అధికమించబోయి కారు బోల్తా పడి ఒకరు మృతి చెంది ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి బంగారుపాలెం మండలం మొగిలి ఘాట్ రోడ్డులో చోటు చేసుకుంది. సీఐ లక్ష్మయ్య ఇచ్చిన సమాచారం మేరకు.. కేరళ రాష్ట్రం కట్టం గ్రామానికి చెందిన ఆదిత్య, ప్రకాష్ కుమార్, కృత్తిక్ ముగ్గురు చిత్తూరు నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారులో అతివేగంగా వెళుతూ ముందు వెళుతున్న వాహనాలను అధిగమించబోయి గుర్తు తెలియని వాహనాలను ఢీకొని కారు బోల్తా పడింది. సంఘటన స్థలంలోనే కేరళ రాష్ట్రానికి చెందిన సునీల్ కుమారుడు ఆదిత్య (20) మృతి చెందాడు. ప్రవీణ్ కుమార్, కృత్తిక్‌లకు గాయాలైయ్యాయి. ఆదిత్య శవ పంచినామా నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు చైన్ చోరీ

ప్రజాశక్తి-తవణంపల్లి: మహిళ మెడలోని బంగారు చైన్ చోరీకి గురైన సంఘటన శుక్రవారం మండలంలోని కామాలూరులో వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. కామాలూరుకు చెందిన చంద్రకాంతమ్మ గ్రామంలోని తన ఇంటి వద్ద ఉంది. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి దాహం అంటూ నీళ్ల అడిగారు. చంద్రకాంతమ్మ కుళాయి వద్ద నీళ్ల వస్తాయని చెప్పి, గేట్ వాల్ ఆన్ చేయబోయింది. ఇంతలో ముగ్గురులోని ఒకరు చంద్రకాంతమ్మ మెడలోని 28గ్రాముల బంగారు చైన్‌ను లాక్కెల్లారు. బైక్‌పై ముగ్గురు దుండగులు పరారైయ్యారు. చంద్రకాంతమ్మకు మెడభాగంలో గాయాలై కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు దుండగులను వెంబడించారు. ఎంతకీ చిక్కకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు రంగం ప్రవేశం చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థానికులకు ప్రతి మంగళవారం శ్రీవారి దర్శనం : ఆరణి

ప్రజాశక్తి -తిరుమల: టిటిడి పాలక మండలి ఏర్పాటు అయ్యాక స్థానికులకు ప్రతి మంగళవారం శ్రీవారి దర్శనం ఉంటుందని, ఇప్పటికే సీఎం, పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకొని వెళ్లానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల తర్వాత మొదటి సారి ఆయన తిరుమల స్థానికులతో సమావేశమయ్యారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలాజీ నగర్ స్థానికుల సమస్యలను 90 రోజుల్లో పరిష్కరించాలని సీఎం ఆదేశించారని, టిటిడి అధికారులు కూడా వెంటనే స్థానికుల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. శ్రీవాణి, ఇతర దర్శనాలల్లో అవినీతిపై విజిలెన్స్ విచారణపై చట్టం తన పని తాను చేసుకుంటుందని అన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం విఐపి విరామ సమయంలో తెలంగాణ ఎమ్మెల్సీ సుంకర రాజు, తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. అలాగే నటి హేమ శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రేవ్ పార్టీ కేసులో షరతులతో కూడిన బెయిల్ వచ్చిందన్నారు. శ్రీవారి దర్శనం బ్రహ్మాండంగా జరిగిందన్నారు. రేవ్ పార్టీపై అనేక కథనాలు మీరే రాశారని, మీకే తెలియాలి అంటూ మీడియాను ఉద్దేశించి సెటైర్లు వేశారు.

తిరుమల హోటళ్లలో నాణ్యమైన భోజనం అందించాలి : ఈవో

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలకు విచ్చేసే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించడమే టీటీడీ లక్ష్యమని ఈవో జె శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో శుక్రవారం సాయంత్రం ఈవో, జేఈవో వీరబ్రహ్మంతో కలిసి తిరుమలలోని హోటళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ, సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి ప్రముఖమైన హోటళ్లతో జాబితా రూపొందించడానికి ఇండియన్ క్యులినరీ ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకులు చలేశ్వరరావు, తాజ్ హోటల్స్ (జిఎం) చౌదరి సూచనలను ఆహ్వానించినట్లు తెలిపారు. ముందు తిరుమల ఎస్టేట్స్ స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమలలోని హోటళ్ల గురించి వివరించారు.

టిటిడి ఐటి విభాగంపై సమీక్ష

టీటీడీ ఐటి విభాగం భక్తులకు అందిస్తున్న వివిధ సేవల గురించి జియో బృందంతో ఆయన సమీక్షించారు. అనంతరం ఆలయ సిబ్బంది, పోటు కార్మికులతో ప్రసాదాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈవోలు లోకనాథం, రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి, ట్రాన్స్‌పోర్ట్ శేషారెడ్డి, ఐటీ మేనేజర్ నాదముని, జియో సంస్థ ప్రతినిధులు మోషిన్ అబ్బాస్, విజయ్ కుమార్, మంజీత్, పోటు కార్మికులు పాల్గొన్నారు.

5,178 మందికి పింఛన్లు: ఎంపీడీవో

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: పెంచిన పెన్షన్లను జూలై 1వ తేదీ మండలంలో 5,178 మందికి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో త్రివిక్రమరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలోని పెన్షన్ దారులకు మూడు కోట్ల 48 లక్షల 95 వేల 500 వందల రూపాయలు సచివాలయ సిబ్బంది ద్వారా 5178 పెన్షన్ దారులకు పంపిణీ చేయనన్నట్లు తెలిపారు. ఈ పెన్షన్లను పింఛనుదారుల వేలిముద్ర, పేస్ రీడింగ్, హై రీడింగ్, ద్వారా ఆన్‌లైన్‌లో వాళ్లని గుర్తించి పంపిణీ చేస్తామన్నారు. వితంతువులు, వృద్ధుల పెన్షన్లు 3వేల నుండి 4వేల రూపాయలకు, వికలాంగుల పెన్షన్ 4వేల నుండి 6వేల రూపాయలకు, డయాలసిస్ పేషెంట్ పెన్షన్, పక్షవాత పెన్షన్లు 5వేల నుండి 10వేల రూపాయలకు ప్రభుత్వం పెంచి ఇస్తోందని మీడియాతో తెలిపారు. ఈ పెన్షన్లను సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతి ఇంటికి పెన్షన్ దారులకు అందజేస్తారని ఆయన అన్నారు. జూన్ నెలలో 3వేలు, జూలై నెల 4వేలు మొత్తం ఏడు వేలు ఒక్కో పెన్షన్ దారుడికి అందజేస్తారని ఒకటో తేదీ తప్పకుండా తీసుకోవాలని బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీడీవో తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపిడివో త్రివిక్రమరావు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1985-86 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పూర్వ విద్యార్థుల తరపున గత ఏడాదిలో పదో తరగతిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు వార్షవర్ధన్, గెర్షోమ్, యావేష్‌లకు నగదు ప్రోత్సాహంతో పాటు బహుమతులను ప్రధానోపాధ్యాయురాలు భారతి చేతుల మీదుగా శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలను దృష్టిలో ఉంచుకుని ఇదే పాఠశాలలో చదివి ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. విద్యార్థులు కష్టపడి బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. చదువుతోనే ఉన్నతి సాధ్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్ దామోదర్ , పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వారపు సంత రూ. 3.79లక్షలకు కైవసం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని గంగాధర నెల్లూరు గ్రామ పంచాయతీకి చెందిన వారపు సంతను జీడీ నెల్లూరు మండల వైస్ ఎంపీపీ హరిబాబు సోదరుడు విజయకుమార్ వేలంపాటలో కైవసం చేసుకున్నారని సర్పంచ్ సుబ్రమణ్యం, ఈవోపీఆర్డీ రాఘవేంద్ర రాజు పంచాయతీ కార్యదర్శి అంజాద్ బాషా తెలిపారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్ లో హోటల్ గదిని. గంగాధరనెల్లూరు కు చెందిన మల్లీశ్వరి రూ. 26,600లకు వేలంపాటలో కైవసం చేసుకున్నారని తెలిపారు.

డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నా మని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఏ, బికాం, బిఎస్‌సి, మూడేళ్లు, నాలుగేళ్ల కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియెట్ అర్హత కలిగిన విద్యార్థిని విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రభుత్వం నుండి వచ్చే అన్ని రకాల రాయితీలతో పాటు చక్కని హాస్టల్ వసతి వుందని తెలిపారు. గూడూరు డివిజన్ లో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వున్న ఏకైక డిగ్రీ కళాశాల ఎస్‌కెఆర్ మాత్రమేనని ఎంతో అనుభవజ్ఞులైన ప్రభుత్వ అధ్యాపకులు కళాశాలలో చేరిన విద్యార్థులకు పోటీ పరీక్షలలో శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉన్నత చదువులకు, స్వయం ఉపాధికి ఇంటర్న్‌షిప్ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. కళాశాలలో ప్రవేశం పొందాలని ప్రిన్సిపాల్ కోరారు. వివరాలకు కళాశాల కార్యాలయంలో కాని, 9866008662, 9553558613 నెంబర్లను కానీ సంప్రదించాలన్నారు.

రైతులకు అధిక దిగుబడి వంగడాలు

- ఐకార్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్ రాజ్ శర్మ

ప్రజాశక్తి - క్యాంపస్ : దేశంలోని అన్ని రాష్ట్రాలలోని రైతులకు చిరుధాన్యాలలో అధిక దిగుబడి వంగడాలను అందిస్తామని ఐకాన్ డిప్యూటీ జనరల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్ రాజ్ శర్మ పేర్కొన్నారు. ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధన మండలి, ధాన్యాల పరిశోధన సంస్థ హైదరాబాద్ వారి సమితి ఆధ్వర్యంలో అఖిల భారత చిరుధాన్యాల పరిశోధన సదస్సు ముగింపు సమావేశం శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలోని వివిధ మెట్ట ప్రాంతాలలో, వర్షాభావ ప్రాంతాలలో పండించే రైతులకు సరికొత్త వంగడాలను అందించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారన్నారు. దేశంలో వివిధ వాతావరణ పరిస్థితులను అనుగుణంగా చీడపీడలను తట్టుకొని, అధిక దిగుబడితో పాటు అధిక పోషక విలువలు కలిగిన రకాలను, వంగడాలను వివిధ రాష్ట్రాలలో సాగు చేయడానికి ఐకార్ తరపున సిఫారసు చేస్తున్నామన్నారు. చిరుధాన్యాలలో నూతన వంగడాలను, రకాలను తమ విస్తృత పరిశోధన ద్వారా సరికొత్త వంగడాలను తీసుకువచ్చిన పరిశోధన కేంద్రాన్ని జాతీయస్థాయిలో ప్రతిభను ఆధారంగా ఘనంగా సత్కరించి నిధులను కేటాయిస్తామన్నారు. ఈ జాతీయ స్థాయి సదస్సులో చిరుధాన్యాల పరిశోధన ఫలితాలు, చిరుధాన్యాల పంటలలో ఉత్పత్తి, ఉత్పాదకను పెంచే వివిధ రకాల వంగడాల గురించి చర్చించామన్నారు. భవిష్యత్తులో ఆహార భద్రత, పోషక విలువల భద్రత సాధించే దిశగా జరిగిన ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా చిరుధాన్య పంటలలో జరిగిన పరిశోధన ఫలితాలను విశ్లేషించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఈశ్వరరామిరెడ్డి డాక్టర్ తార సత్యవతి, డాక్టర్ మధుసూదన, డాక్టర్ శారదా జయలక్ష్మి దేవి, డాక్టర్ ఎస్ కె ప్రధాన్, డాక్టర్ పివి సత్యనారాయణ, దేశంలోని వివిధ పరిశోధనా కేంద్రాల నుంచి విచ్చేసిన వ్యవసాయ, చిరుధాన్యాల శాస్త్రవేత్తలు, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం అసోసియేట్ డీన్ డాక్టర్ సుమతి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రుతు పవనాల ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారిన దృష్ట్యా నీటి ద్వారా, దోమల ద్వారా అంటు వ్యాధులు ప్రబలే అవకాశమున్నదున ప్రజలు వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, నీటి నిల్వ పాత్రలను ప్రతి శుక్రవారం శుభ్రపరిచి అరబెట్టి తిరిగి వినియోగించుకోవాలని సూచించారు.

మున్సిపల్ కౌన్సిలర్లతో నేదురుమల్లి సమావేశం

ప్రజాశక్తి- వెంకటగిరి: వెంకటగిరి మున్సిపల్ కౌన్సిలర్లతో వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షు డు నేదురుమల్లి రాం కుమార్ రెడ్డి స్థానిక ఆయన నివాసం ఎన్‌జెఆర్ భవనంలో శుక్రవారం సమా వేశం నిర్వహించారు. వార్డులలో వైసీపీ కార్యకర్త లకు అండగా నిలవాలని సూచించారు. అభివృద్ధి చేస్తే అధికార పార్టీకి సహకరిస్తామని, వైసీపీ కార్యకర్త లు, నాయకులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. అనంతరం నియోజక వర్గంలోని పలు మండలాల పరిధిలోని వైసీపీ నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

అప్రమత్తంగా వుండాలి..

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రజలు అప్రమత్తంగా వుండాలని బుచ్చినాయుడు కండ్రిగ వైద్యాధికారి దివాకర్ సూచించారు. మండలంలోని కాండం పంచాయతీని శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే డయేరియా రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని కాంపాళెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో డయేరియా వచ్చే ప్రమాదం ఉందని అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ సర్పంచి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా ఉండాలి: ఆర్డీవో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు బాధ్యతగా ఉండాలని శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి కోరారు. తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేసే వేనాటి మురళీధర్ రెడ్డి, బసవయ్యపాళెం వీఆర్వోగా పనిచేసే పోచినేని మురళినాయుడు ఈ నెల 30వ తేదీ ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వారికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ఆర్డీవో రవిశంకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురళీధర్ రెడ్డి, మురళీనాయుడు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందించారని కొనియాడారు. ఇతర ఉద్యోగులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తహశీల్దారు శివరామ సుబ్బయ్య, డిప్యూటీ తహశీల్దారు ఎర్రంరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మురళీధర్ రెడ్డి, మురళీనాయుడు ఎప్పుడు పిలిచినా అందుబాటులో ఉండేవారన్నారు. అలాంటి వారు నేడు ఉద్యోగ విరమణ రావడం బాధాకరమే అయినా ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు తప్పదన్నారు. అనంతరం వీరికి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పడమాలపేట మండలం ఎస్‌విపురం ఎంపియుపి. పాఠశాలలో పనిచేస్తున్న శ్రీనివాస్ వర్మ, యువశ్రీ తల్లి ధన లక్ష్మమ్మ వర్ధంతి సందర్భం గా 125 మంది విద్యార్థులకు 25 వేల రూపాయలు విలువచేసే నోటు పుస్తకాలు, పలకలు, జామెంట్రీ బాక్స్‌లు, వివిధ వస్తువులను హెచ్‌ఎం ప్రకాష్ అధ్యక్షతన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శనం, రంగయ్య, నరసింహారెడ్డి, కోమల రాణి, మురళీకృష్ణ, చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ, చందన, వాసవి పాల్గొన్నారు.

నేడు బిఎస్ఎన్ఎల్ లోక్ అదాలత్

ప్రజాశక్తి- వెంకటగిరి: వెంకటగిరి కోర్టు ప్రాంగణంలో బిఎస్ఎన్ఎల్ లోక్ అదాలత్ శని వారం నిర్వహించ నున్నట్లు డిఈ అంకయ్య, ఏఈ నాగేశ్వరరావు , జెటీఓపి కామేశ్వరరావు లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిలు ఉన్న బిఎస్ ఎన్ఎల్ వినియోగదారులు ఈ అవకాశం సద్వినియోగ చేసుకోవాలని కోరారు.

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE, CHITTOOR
G.O.P.No. 401 of 2023
Between:
1.V.Varsha,D/o V.Vinod
2.G.Vidhya W/o V.Vinod
3.R.Gopal,S/o Late T.Ramappa
All are residing at D.No.3-13, Lakshmipuram VTC Bairanganipalle, Kuppam Post and Mandal
1 & 2 residing at D.No.1-111/1, Lakshmipuram Village, Kuppam, Chittoor District ...Petitioners
And:
NIL ... Respondents
GENERAL NOTICE
Sir, Please take notice that the petitioners have filed the above Guardian O.P. for appointment of 2nd Petitioner G.Vidhya as a guardian to the 1st petitioner V.Varsha. The above case is posted to **03-07-2024** for general notice. If anybody have objections, please appear before the said Hon'ble Court on that day at **10-30 A.M** either in personal or through an Advocate, otherwise the matter will be decided as per law.
SCHEDULE
Chittoor District- Kuppam- Kuppam Sub District- Plot No.46 in Survey No.70/2 situated in Chinakurabapalli Village of 1200 Sq.ft with the following boundaries: East- Plot No.47, West-20 feet Road, North- Plot No.44, South- Plot No.48
Sd/- L.MUNASWAMY NAIDU
Advocate for the Petitioners
Place: Chittoor, Date 28-06-2024

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా
ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ